ప్రత్యేక జాతీయ సమైక్యతా శిబిరానికి తారా విద్యార్థులు

కే. ఆకాశ్ టీ. ప్రణయ

సంగారెడ్డి కలెక్టరేట్, జనవరి 29 : అస్సాంలోని అగ్రికల్చర్ యూనివర్సిటీలో జరిగే ప్రత్యేక జాతీయ సమైక్యతా శిబిరానికి తమ కళాశాల ఎన్‌సీసీ విద్యార్థులు ఎంపికయ్యారని తారా ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేఎస్ ఎస్ రత్నప్రసాద్ తెలిపారు.

శిబిరానికి బయలుదేరిన విద్యార్థులను సోమవారం ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ తమ కళాశాలకు చెందిన కె.ఆకాశ్, టీ.ప్రణయ ఫిబ్రవరి 1 నుంచి 12వ తేదీ వరకు జరిగే ప్రత్యేక జాతీయ సమైక్యతా శిబిరంలో పాల్గొనడం కళాశాలకే గర్వకారణమన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాల కేడెట్‌లు ఈ శిబిరంలో పాల్గొంటున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాళ్లు ప్రవీణ, డాక్టర్ వెంకటేశం, ఎన్‌సీసీ అధికారి లెఫ్టినెంట్ మనోజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా దర్గా ఉత్సవాలు

బొల్లారం, జనవరి 29: ప్రతి ఏడాదిలాగే ఈ సంవత్సరం కూడా హజ్రత్ సయ్యద్ గోరే బాబా దర్గా ఉత్సవాల్లో భాగంగా సోమవారం 'సందల్' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మున్సిపాలిటీ పరిధికి చెందిన బీసీ కాలనీలోని హజ్రత్ సయ్యద్ గోరే బాబా దర్గా ఉర్సు ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన సందల్ కార్యక్రమానికి బీఆర్ఎస్ రాష్ట్ర సీనియర్ నాయకులు, మున్సిపల్ కౌన్సిలర్ చంద్రారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా చాదర్, పూలు సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం చంద్రారెడ్డి మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ముస్లిం మైనార్టీ వర్గాల సంక్షేమానికి ఎంతో కృషి జరిగిందన్నారు.

దర్గా అభివృద్ధికి సహకరిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా నిర్వాహకులు కౌన్సిలర్ చంద్రారెడ్డిని ఘనంగా సన్మానించారు. రవూఫ్, అజం, ఖాసిం, షాదాబ్, కాలనీవాసులు సత్యనారాయణ పాల్గొన్నారు.

దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న కౌన్సిలర్ చంద్రారెడ్డి

రోటరీ క్లబ్ సేవలు అభినందనీయం

సదాశివపేట, జనవరి 29: రోటరీ క్లబ్ మొయినాబాద్ సేవలు అభినందనీయని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చింతా సాయినాథ్ అన్నారు. సోమవారం రోటరీ క్లబ్ మొయినాబాద్ హ్యాపీ ప్రాజెక్ట్‌లో భాగంగా పట్టణంలోని రవీంద్ర మోడల్ పాఠశాలకు ఫర్నిచర్, కంప్యూటర్స్, సీసీ కెమెరాలు, విద్యార్థులకు షూ అందజేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్లబ్ అందిస్తున్న సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. భవిష్యత్‌లోనూ క్లబ్ మెరుగైన సేవలు అందించాలన్నారు. అనంతరం రోటరీ క్లబ్ మొయినాబాద్ జనరల్ సెక్రెటరీ ఓదెల రాజశేఖర్ మాట్లాడుతూ రోటరీ క్లబ్ విద్య, వైద్యం రెండు అంశాలపై సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నదన్నారు. పేదలకు విద్య, వైద్యం అందించి చేయూతనివ్వడమే క్లబ్ ముఖ్య ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షురాలు అచల, సంగారెడ్డి, జహీరాబాద్ క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు షూ అందజేస్తున్న రోటరీ క్లబ్ మొయినాబాద్ సభ్యులు

అదనపు శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను సస్పెండ్ చేయాలి

సంగారెడ్డి, జనవరి 29: గ్రేడ్-1 మున్సిపాలిటీలో పారిశుధ్య కార్మికుల బకాయి వేతనాలు ఇవ్వాలని, తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకొని, కార్మికులపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్న అదనపు శానిటరీ ఇన్‌స్పెక్టర్ విజయ్‌బాబును సస్పెండ్ చేయాలని కోరుతూ కలెక్టర్ వల్లూరి క్రాంతికి సీఐటీయూ నాయకులు ఫిర్యాదు చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట కార్మికులతో కలిసి సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి యాదగిరి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ మున్సిపల్‌లో పెండింగ్‌లో ఉన్న రెండు నెలల వేతనాలు ఇవ్వాలని కోరారు. అక్రమంగా తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని, ఉద్యోగం కోసం రూ.లక్ష నుంచి రూ.2లక్షల వరకు తీసుకొని వేరేవారికి ఉద్యోగం కట్టబెడుతున్న అదనపు శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. సొంత నిర్ణయంతో విధుల్లోకి తీసుకున్న కొత్త కార్మికులను తొలగించి పాత వారిని విధుల్లోకి తీసుకోవాలన్నారు. లేకుంటే బాధిత కార్మికుల కుటుంబ సభ్యులతో పెద్దఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ నాయకులు రాజు, సువర్ణ, జనార్దన్, నర్సింహులు, దుర్గయ్య, సంగీత, సుగుణమ్మ, లక్ష్మీనారాయణ, యాదయ్య, శ్రీనివాస్, యాదగిరి, పవన్, సురేందర్, నర్సమ్మ, రాజేశ్, సురేశ్, ప్రశాంత్, అమృతమ్మ పాల్గొన్నారు.

వైభవంగా వరసిద్ధివినాయక జయంతోత్సవాలు

న్యాల్‌కల్, జనవరి 29: మండలంలోని హద్నూర్ శ్రీవరసిద్ధి వినాయక స్వామి వారి 224వ జయంతి ఉత్సవాలు వైభవంగా జరిగాయి. సోమవారం ఆలయ పురోహితులు విశ్వనాథ్ దీక్షిత్, పునీత్ దీక్షిత్‌ల ఆధ్వర్యంలో ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పరిసర గ్రామాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులకు అన్నదానం చేశారు. మండలంలోని రేజింతల్, చీకూర్తి గ్రామాల్లోని సిద్ధివినాయక ఆలయాల్లో సంకష్టహర చతుర్థి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ పార్లమెంటరీ ఇన్‌చార్జి జైపాల్ రెడ్డి, నాయకులు ఈరన్న, శ్రీధర్‌రావు, జహీరాబాద్ మున్సిపల్ మాజీ చైర్మన్ మంకాల్‌సుభాశ్, సర్పంచ్ వీరామణి, చీకూర్తి ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, న్యాల్‌కల్ పీఎసీఎస్ మాజీ చైర్మన్ సుభాష్‌గుప్తా పాల్గొన్నారు.

స్వామివారిని దర్శించుకున్న ఎమ్మెల్యే

హద్నూర్ వరసిద్ధి వినాయక స్వామి వారిని జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు. ఆలయాభివృద్ధికి రూ.5లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో జహీరాబాద్ పట్టణ బీఆర్ఎస్ నాయకులు మీధున్‌రాజ్, ఝరాసంగం బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెంకటేశం, ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్, హద్నూర్ పీఎసీఎస్ డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్, నాయకులు బక్కారెడ్డి, మహేశ్, రాజు, స్వామిదాస్, ఆలయ కమిటీ సభ్యులు సీహెచ్.మల్లన్న, ఈరన్నపటేల్, ప్రవన్‌పటేల్, రాజ్‌కుమార్, రాజు, మధు, సుబ్బు, శ్రీశైలం, నరేశ్ పాల్గొన్నారు.


ఆలయంలో మాట్లాడుతున్న జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు

అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

● కలెక్టర్ వల్లూరు క్రాంతి ● ప్రజావాణికి 76 అర్జీలు

అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి కలెక్టరేట్, జనవరి 29: ప్రజావాణికి వచ్చే అర్జీలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి సంబంధిత అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణికి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీదారుల ఫిర్యాదులను స్వీకరించారు. మొత్తం 76అర్జీలు రాగా, 27 రెవెన్యూ శాఖకు సంబంధించినవి, మిగతా 49 అర్జీలు వివిధ శాఖలకు సంబంధించి వచ్చాయి. జిల్లాలోని ప్రభుత్వ విద్యా సంస్థలు(కళాశాలలు, పాఠశాలలు), వైద్య ఆరోగ్య శాఖకు సంబంధించి పీహెచ్‌సీలు, సబ్ సెంటర్లకు అవసరమైన వసతుల కల్పనకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. అవసరమైన అంగన్‌వాడీ భవనాలకు ప్రతిపాదనలు ఇవ్వాలన్నారు.

గ్రామ పంచాయతీల్లో ప్రభుత్వ భవనాల మరమ్మతులు, సీసీ రోడ్లు, అప్రోచ్ రోడ్లు తదితర మరమ్మతులపై ప్రతిపాదనలు ఇవ్వాలని అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, డీఆర్వో నగేశ్, ఏవో పరమేశ్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఈవీఎం అవగాహన కేంద్రం ప్రారంభం

ఓటర్లకు ఈవీఎంలపై అవగాహన కల్పించేందుకు కలెక్టరేట్‌లో ఈవీఏం అవగాహన కేంద్రాన్ని కలెక్టర్ వల్లూరు క్రాంతి సోమవారం ప్రారంభించారు. అనంతరం ఈవీఎం(ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రం)పై ఓటు వేసి వీవీ ప్యాట్‌లో చెక్ చేసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ఈవీఏం అవగాహన కేంద్రాలను ఏర్పాటు చేశామని, పోలింగ్ నమూనపై ప్రజలకు అవగాహన కల్పించనున్నట్టు తెలిపారు.

సర్పంచ్‌లకు సన్మానం

మునిపల్లి: సర్పంచ్ రమేశ్‌ను సన్మానిస్తున్న లింగాయత్ సభ్యులు

జిన్నారం, జనవరి 29: ఐదేండ్ల పదవీ కాలాన్ని పూర్తి చేసుకుంటున్న సర్పంచ్‌లను ఎంపీపీ రవీందర్‌గౌడ్ ఘనంగా సన్మానించారు. సోమవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో సర్పంచ్‌లకు సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఎంపీడీవో రాములుతో కలిసి వివిధ గ్రామాల సర్పంచ్‌లను సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. అనంతరం అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బందిని సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ రవీందర్ గౌడ్ మాట్లాడుతూ నిత్యం ప్రజా సేవలో ఉంటూ గ్రామాల అభివృద్ధి కోసం అహర్నిశలు కష్టపడిన సర్పంచ్‌లను సన్మానించుకోవడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీవో సంతోష్‌కుమార్, జిన్నారం ఎంపీటీసీ లావణ్యనరేశ్, గడ్డపోతారం ఎంపీటీసీ జనాబాయి పాల్గొన్నారు.

మునిపల్లిలో సర్పంచ్ రమేశ్‌కు..

మునిపల్లి, జనవరి 29: మండల కేంద్రమైన మునిపల్లి సర్పంచ్ రమేశ్‌ను గ్రామ వీరశైవ లింగాయత్ బంధువులు పంచాయతీ కార్యాలయంలో శాలువా, పూలమాలతో సన్మానించారు. మునిపల్లి వీరశైవ లింగాయత్ డైరీని ఆవిష్కరించారు.

సర్పంచ్‌ల కాలపరిమితి పెంచాలి

నారాయణఖేడ్, జనవరి 29: సర్పంచ్‌ల కాల పరమితి పెంచాలని నారాయణఖేడ్ మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు జగదీశ్వర్‌చారి ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం నారాయణఖేడ్‌లోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో సర్పంచ్‌లతో సమావేశం నిర్వహించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఎన్నికలు జరిగేంత వరకు ప్రస్తుత సర్పంచ్‌లనే కొనసాగించాలని కోరారు. కరోనా సమయంలోనూ ప్రజలతో మమేకమై గ్రామాల అభివృద్ధికి కృషి చేశామన్నారు. సమావేశంలో సర్పంచ్‌లు వెంకటేశం, ప్రసాద్, రాజు, నాయకులు రవీందర్‌నాయక్, పరమేశ్, ప్రభాకర్, సత్యపాల్‌రెడ్డి, పండరీనాయక్ పాల్గొన్నారు.

మామిడ్గి పాలకవర్గానికి వీడ్కోలు

న్యాల్‌కల్, జనవరి 29: మండలంలోని మామిడ్గి పంచాయతీ పాలకవర్గానికి సోమవారం ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా స్థానిక పంచాయతీ కార్యాలయ ఆవరణలో వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. సర్పంచ్ చంద్రన్న, ఉప సర్పంచ్ శరణయ్య స్వామితోపాటు వార్డు సభ్యులను మండల అధికారులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఘనంగా సన్మానించారు.

అనంతరం సర్పంచ్ చంద్రన్న మాట్లాడుతూ అందరి సహాయసహకారాలతో గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకట్‌రెడ్డి, ఎంపీవో సురేశ్, పంచాయతీ కార్యదర్శి గౌసుద్దీన్, నాయకులు తుక్కారెడ్డి, మాణిక్‌రెడ్డి, ఎల్లారెడ్డి, నర్సింహారెడ్డి, జగన్నాథ్‌రెడ్డి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

చెత్త వేస్తే చర్యలు తప్పవు

రామచంద్రాపురం, జనవరి 29: రోడ్లపై చెత్తను వేసి పరిసరాలను అపరిశుభ్రంగా మార్చేవారిపై చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య హెచ్చరించారు. తెల్లాపూర్ పరిధిలో రోడ్ల పక్కన చెత్తను వేసిన వారికి కమిషనర్ రూ.12వేలు జరిమానా విధించారు. సోమవారం తెల్లాపూర్ గ్రామంలో పర్యటిస్తున్న సమయంలో వైన్స్‌ల పరిసరాల్లో ప్లాస్టిక్ కవర్లు, గ్లాస్‌లు తదితర చెత్తా చెదారం ఉండటాని గమనించి కమిషనర్ సీరియస్ అయ్యారు. ఎంఎం వైన్‌మార్ట్‌కు రూ. 10వేలు, మరో వైన్స్‌కి రూ.2వేలు జరిమానా విధించారు.

ఆక్రమణల తొలిగింపు

తెల్లాపూర్ గ్రామంలోని రేడియల్ రోడ్డుకు ఇరువైపుల ఉన్న ఓపెన్ డ్రైన్‌పైన వెలసిన అక్రమ డబ్బాలను కమిషనర్ సమ్మయ్య ఆదేశాల మేరకు మున్సిపల్ సిబ్బంది సోమవారం జేసీబీ సహాయంతో తొలిగించారు. రోడ్డుకు ఇరువైపుల వెలసిన ఆక్రమణలతో ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతున్నదని తొలిగించారు. ఓపెన్‌డ్రైన్‌పై ఎవరైనా డబ్బాలను ఏర్పాటు చేస్తే వెంటనే తొలిగించి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వరి సాగుపై అవగాహన

సిర్గాపూర్, జనవరి 29: సుల్తానాబాద్ శివారులో రైతులు యాసంగిలో నాట్లు వేస్తున్న పంట పొలాలను మండల వ్యవసాయాధికారి శషాంక్ సోమవారం పరిశీలించారు. ఈమేర కు వరి సాగుపై తగు సలహాలు ఇచ్చారు. వరి నాటు వేసేటప్పుడు 30రోజుల నారును పొలంలో నాటుకోవాలన్నారు. ఎకరానికి 30 కేజీల యూరియా, 50 కేజీల డీఏపీ, 15 కేజీ ల ఎంఓపీ ఎరువులను ఆఖరి దుక్కిలో వేసుకోవాలన్నారు. కాండంతొలుచు పురుగు నివారణకు నారు మడిలో 800 గ్రాముల కార్బో ఫిరాన్ గుళికలు, వరి నాటుకు వారం రోజుల ముందు వేసుకోవాలన్నారు.

కార్యకర్తలకు అండగా బీఆర్ఎస్

సిర్గాపూర్, జనవరి 29: బీఆర్ఎస్ కార్యకర్తలకు అండగా ఉంటుందని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని పోచాపూర్ గ్రామానికి చెందిన కార్యకర్త మహ్మద్ సదర్‌సాబ్ ఇటీవల మృతి చెందగా, ఆయనకు పార్టీ సభ్యత్వ బీమా కింద రూ. 2లక్షలు మంజూరయ్యాయి. ఆ చెక్కును సోమవారం భూపాల్‌రెడ్డి లబ్ధిదారు నదీంకు అందజేశారు.

కంది సెంట్రల్ జైలులో 'పాన్ ఇండియా'

కంది, జనవరి 29: కందిలోని సెంట్రల్ జైలులో సోమవారం పాన్ ఇండియా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి హనుమంతరావు హాజరై మాట్లాడారు. జైలులో శిక్ష అనుభవిస్తున్న యువత, నేరం చేసి శిక్ష అనుభవిస్తున్న 18సంవత్సరాల కంటే తక్కువ వయసు ఉన్నవారికి న్యాయ సహాయం అందించడానికి పాన్ ఇండియా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. న్యాయ సహాయం అవసరం ఉన్నవారు న్యాయ సేవాధికార సంస్థకు తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో జైలర్ సంజీవ్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధిలో ముందున్నాం

ఎంపీపీ సద్దిప్రవీణావిజయభాస్కర్‌రెడ్డి

సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సద్ది ప్రవీణావిజయభాస్కర్‌రెడ్డి

గుమ్మడిదల, జనవరి 29: ఐదేళ్ల కాలంలో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో గుమ్మడిదల మండలాన్ని అభివృద్ధిలో ముందువరుసలో నిలబెట్టింది పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అని ఎంపీపీ సద్ది ప్రవీణావిజయభాస్కర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. పలు శాఖల అధికారులు ప్రగతి నివేదికలను సభకు చదివి వినిపించారు. ఈ సమావేశానికి పీసీబీ అధికారి డుమ్మా కొట్టడంపై ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిశ్రమల విషపూరితమైన వాయువులు, రసాయన వ్యర్థాల గురించి ప్రశ్నిస్తామనే పీసీబీ అధికారి గైర్హాజరు అయ్యారని సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలాని శాశ్వత ఎంఆవోను నియమించాలని ఎంపీటీసీ నాగేందర్‌గౌడ్ కోరారు. ఉద్యానవన శాఖ అధికారి మాట్లాడుతూ ఆయిల్‌ఫాం, కూరగాయల సాగులో వినియోగించే మల్చింగ్‌కు సబ్సిడీ ఉందని, రైతులు ముందుకు రావాలని కోరారు. వ్యవసాయాధికారి శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ ఇప్పటి వరకు మండలంలో 2023సంవత్సరంలో 13మంది రైతు కుటుంబాలకు రైతుబీమా అందజేసినట్లు తెలిపారు. యాసంగికి ఎరువులు సిద్ధంగా ఉన్నాయన్నారు. ఆర్టీసీ బస్సుల కొరతతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారని ప్రజాప్రతినిధులు తెలిపారు. ఎంపీపీ మాట్లాడుతూ ఐదేండ్ల కాలంలో మండలంలోని 13గ్రామ పంచాయతీలకు జాతీయ ఉత్తమ అవార్డులు వచ్చాయని గుర్తు చేశారు. ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అర్హులకు సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మంజులావెంకటేశ్‌గౌడ్, ఎంపీడీవో చంద్రశేఖర్, ఎంపీవో ద యాకర్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

కార్పొరేట్ కార్యాలయాన్ని తలపించాలి

గుమ్మడిదల పోలీస్‌స్టేషన్ భవన నిర్మాణానికి స్థలాన్ని, ప్లాన్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ రూపేశ్

గుమ్మడిదల, జనవరి 29: నూతన మండలముగా ఏర్పడిన గుమ్మడిదలలో కార్పొరేట్ కార్యాలయాన్ని తలపించేలా పోలీస్‌స్టేషన్ భవనాన్ని నిర్మించనున్నట్లు ఎస్పీ చెన్నూరి రూపేశ్ అన్నారు. సోమవారం మండలంలోని జాతీయ రహదారి 765-డీ సమీపంలో 1.7 ఎకరాల్లో పోలీస్‌స్టేషన్‌కు కేటాయించిన స్థలాన్ని, ప్లాన్‌ను పరిశీలించారు. ఈ నిర్మాణ పనులు హెటిరో డ్రగ్స్ గ్రూప్ చేపట్టనున్నట్లు తెలిపారు. ఆయనవెంట పటాన్‌చెరు డీఎస్పీ పురోషోత్తంరెడ్డి, సీఐ వేణుకుమార్, ఎస్సై లక్ష్మారెడ్డి, హెటిరోడ్రగ్స్ గ్రూప్ మేనేజర్ రామ్మోహన్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

జిన్నారం పీఎస్‌ను పరిశీలించిన ఎస్పీ

జిన్నారం, జనవరి 29: జిన్నారం పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ రూపేశ్ సోమవారం పరిశీలించారు. సంగారెడ్డి నుంచి జిన్నారం మీదుగా గుమ్మడిదలకు వెళ్తున్న క్రమంలో జిన్నారం పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. నెల రోజుల క్రితం జిన్నారం పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన ఓ ప్రెస్‌మీట్‌కు హాజరైన ఎస్పీ పీఎస్‌లో చేపట్టాల్సిన చిన్నచిన్న మరమ్మతులను సూచించారు. ఈ నేపథ్యంలోనే జిన్నారం పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన ఎస్పీ మరమ్మతు పనులు, పోలీస్‌స్టేషన్‌ను గదులను పరిశీలించారు. కార్యక్రమంలో డీఎస్పీ పురుషోత్తంరెడ్డి, సీఐ వేణుకుమార్, ఎస్ఐ విజయరావు పాల్గొన్నారు.

పోలీస్ క్వార్టర్స్‌లో అగ్నిప్రమాదం

రామచంద్రాపురం, జనవరి 29: పోలీస్ క్వార్టర్స్‌లో అగ్నిప్రమాదం జరగడంతో పార్కింగ్‌లో ఉన్న పలు వాహనాలు మంటలకు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఈ ఘటన ఆర్సీపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. ఆర్సీపురం డివిజన్ పరిధిలోని కానుకుంట పోలీస్ క్వార్టర్స్ ఆవరణలో ఆర్సీపురం, చందానగర్ పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో వివిధ కేసుల్లో సీజ్ అయిన కార్లు, బైక్స్, ఆటోలను పార్కింగ్ చేశారు. ఆదివారం సాయంత్రం రైతుబజార్ పక్కనే ఉన్న ప్రహరీ పక్కన ఎవరో సిగరెట్ తాగి ఆ పీకను ప్రహరీ అవతల పడవేయడంతో ఎండు గడ్డికి మంటలు అంటుకొని వ్యాపించాయి. విషయం తెలుసుకున్న ఇన్‌స్పెక్టర్ నరేందర్‌రెడ్డి, ఎస్సై శశికాంత్‌రెడ్డి పటాన్‌చెరు, భెల్ ఫైర్ స్టేషన్‌లకు సమాచారం అందించడంతో ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను అదుపుచేశారు. మంటల్లో 8కార్లు, 36బైక్‌లు, 3ఆటోలు దగ్ధమైన్నట్లు తెలిపారు. ఏసీపీ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మంటలకు పూర్తిగా దగ్ధమైన వాహనాలు

మానాక్సియా కార్మికులకు న్యాయం చేయాలి

సంగారెడ్డి, జనవరి 29: బొల్లారం పారిశ్రామిక ప్రాంతంలోని మానాక్సియా పరిశ్రమ యాజమాన్యం కార్మికులకు న్యాయం చేయడం లేదని డీసీఎల్‌కు సీఐటీయూ నాయకులు ఫిర్యాదు చేశారు. సోమవారం కలెక్టరేట్‌లోని డీసీఎల్ కార్యాలయంలో అధికారిని కలిసి మానాక్సియా కార్మికులకు న్యాయం చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రాజయ్య మాట్లాడుతూ పరిశ్రమ యాజమాన్యం కార్మిక చట్టాలను తుంగలో తొక్కిందని, ఐదు సంవత్సరాల క్రితం అక్రమ లాకౌట్ చేసిందన్నారు. దానికి ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతి లేదని, కార్మికులకు సెటిల్మెంట్ చేయకుండా పరిశ్రమ యంత్రాలు తీసుకుపోయేందుకు కుట్ర చేస్తున్నదని ఆరోపించారు. నష్టపరిహారం చెల్లించకుండా యంత్రాలు తరలిస్తే ఊరుకునే ప్రసక్తేలేదని హెచ్చరించారు. పరిశ్రమ యాజమాన్యంతో చర్చలు జరిపి కార్మికులకు న్యాయం చేయాలని కోరారు.

గోవా మద్యం పట్టివేత

మునిపల్లి, జనవరి 29: గోవా నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని పట్టుకున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐలు మోహన్‌కుమార్, రమేశ్‌రెడ్డి, రజిత తెలిపారు. సోమవారం మండల పరిధిలోని కంకోల్ గ్రామ శివారులోని డెక్కన్ టోల్‌ప్లాజా వద్ద ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వాహనాలను తనిఖీ చేశారు. వాహన తనిఖీల్లో అనుమానంతో కనిపించిన ఓ వాహనాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పరిశీలించగా 42మద్యం బాటిళ్లు కనిపించాయి. మద్యాన్ని స్వాధీనం చేసుకొని, మద్యాన్ని తరలిస్తున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. కార్యక్రమంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్సైలు విశ్వనాథ్, అనిల్‌కుమార్ ఉన్నారు.

కోహీర్‌ను అభివృద్ధి చేశాం

కోహీర్, జనవరి 29: ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతోపాటు ఉపాధిహామీ నిధులతో కోహీర్ పట్టణాన్ని అభివృద్ధి చేశామని సర్పంచ్ అతియాజావేద్ అన్నారు. సోమవారం కోహీర్ పంచాయతీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. గ్రామ పంచాయతీకి మంజూరైన రూ. 4.0కోట్ల నిధుల్లో విద్యుత్ దీపాల ఏర్పాటు, బిల్లుల కోసం రూ.2.12కోట్లను చెల్లించామన్నారు. పంచాయతీరాజ్ శాఖ ద్వారా మంజూరైన 1.8కోట్లతో రైల్వే గేటు నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు రోడ్డు నిర్మించామన్నారు. ఈజీఎస్ ద్వారా మంజూరైన రూ.1.4కోట్లతో ఆటో స్టాండ్ నుంచి మౌలానా మోహీ జొద్దీన్ తుర్కి దర్గా వరకు సీసీ రోడ్డును నిర్మించామని చెప్పారు. తనకు సహకరించిన గ్రామ ప్రజలందరికీ ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో మాజీ కోఆప్షన్ సభ్యుడు జలీల్‌అహ్మద్, నాయకులు ఇమ్రాన్, వహీద్, వార్డు సభ్యుడు నాగేశ్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో ఈసీసీఈ డే

గుమ్మడిదల, జనవరి 29: మండలంలోని కానుకుంట 2వ అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం అంగన్వాడీ టీచర్ ఈసీసీఈ డేను నిర్వహించారు. చిన్నారులను ఆటపాటలతో అలరించారు. గతంలో అంగన్వాడీకి వచ్చిన చిన్నారులు ఇప్పుడు ఏవిధంగా ఉన్నారు, వారి శరీర ఎదుగుదల వంటి విషయాలు చిన్నారుల తల్లులకు తెలిపారు. అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి

మునిపల్లి, జనవరి 29: వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించాలని జహీరాబాద్ మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ జె.ప్రకాష్ రెడ్డి, డెక్కన్ టోల్‌ప్లాజా మేనేజర్ విజేంద